క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి చూపు మందగించిందని గుర్తించి వారిని శస్త్ర చికిత్స కోసం బోధన్ కంటి ఆస్పత్రికు తరలించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, వైద్యాధికారి నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

జనగామలో..

బీబీపేట: మండలంలోని జనగామ గ్రామంలో ఐసీఎం రెస్క్యూ పింక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి ఉచిత వైద్యం చేయడంతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ రాజు, పాత స్వామి, రామస్వామి, చంద్రం, స్వామి, మహేష్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంప్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ వి.సారిక 8 మంది దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేపించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అర్థశాస్త్ర పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ఆకుల సుధాకర్ రచించిన 'ఇండియాస్ డిజిటల్ ఎకానమీ గ్రోత్, ఛాలెంజెస్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్' అనే పుస్తకాన్ని ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ రచయిత సుధాకర్‌ను అభినందించారు. సుధాకర్ రాసిన పుస్తకం అర్థశాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు, పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రిన్సిపాల్ అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, అకడమిక్, ఐక్యూఏసీ సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు దినకర్, గణేష్, రాజ్‌గంభీర్ రావు, రాములు, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు మాక్ టెస్ట్

కామారెడ్డి అర్బన్: గ్రూప్ -2 పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో మాక్ టెస్ట్(మాదిరి పరీక్ష) నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 మాక్ టెస్ట్‌లో పాల్గొనే మైనారిటీ అభ్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, జైన్, బుద్ధిష్ట్, పార్సీలు) ఈనెల 29లోగా కలెక్టరేట్‌లోని 222 గదిలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఓటరు నమోదు, సవరణల కోసం ప్రత్యేక శిబిరం

రాజంపేట: ఓటరు నమోదు, సవరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. నేడు(శనివారం), రేపు(ఆదివారం) రెండు రోజులు నూతన ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణల కోసం సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు.

వ్యాసరచన పోటీలు



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ యూనిట్-5, 6 అధికారులు డాక్టర్ అంజయ్య, డాక్టర్ హరితలు తెలిపారు. ఈ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. అధ్యాపకుడు డాక్టర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులు మేరీ వరదానం, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్, కవిత, మంజుల, ఆంజనేయులు, పంచశీల, వీరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు, కోతులు



సోమార్‌పేట్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



దేవునిపల్లి శివారులో కోతుల గుంపు

- రెండేళ్ల చిన్నారిపై దాడి చేసిన కోతులు
- భయంతో బయటకు ఒంటరిగా రావాలంటే జంకుతున్న జనాలు

ఎల్లారెడ్డిరూరల్: కోతులు, కుక్కలను చూడగానే జనాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కోతుల మందను చూసి జనాలు భయాందోళన చెందుతుండగా మరో వైపు కుక్కల గుంపును గుండె ఘుబేలుమనేలా ఉందని జనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులను అటవీ ప్రాంతాలకు తరలించేలా, కుక్కలకు వ్యాక్సిన్లు వేసి వాటి సంతానం పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో కొద్ది రోజులుగా కుక్కలు, కోతుల బారిన పడి పలువురు గాయాలపాలయ్యారు. కుక్కలు, కోతులు కరిచిన బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో మొదటి డోసు వ్యాక్సిన్లు వేసుకున్నారు. మార్కెట్‌లో ఏదైనా వస్తువులను చేతిలో పట్టుకుని పోతే కోతులు దాడి చేసి గాయపరిచి చేతిలోని వస్తువులను లాక్కెళ్తున్నాయని, ఇంటి మీద ఉన్న కూన పెంకులను తీసి ఇళ్లపైకి పందిరి వేస్తున్నాయని, వర్షానికి ఇంటిపై కప్పిన కవర్లను చించేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మూడు రోజుల క్రితం ఇంటిలో ఉన్న రెండేళ్ల చిన్నారిపై కోతులు దాడి చేయడంతో చిన్నారికి గాయాలయ్యాయి. ఇటీవల ఇంటిపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లిన యువతిపై కోతులు దాడి చేయడంతో ఆమె దాబాపై నుంచి పడడంతో కాళ్లు విరిగాయి. జనాల ఇబ్బందులను దృష్టిలో కోతులను అటవీ ప్రాంతాలకు తరలించి, కుక్కలకు సంతాన వృద్ధి కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కోతుల దాడిలో గాయపడ్డ చిన్నారి

కోతుల బెడద అరికట్టాలి

ఎల్లారెడ్డిలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వాటిని నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. కోతుల కారణంగా చిన్నారులు, పెద్దలు వాటి బారిన పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఓ మహిళపై కోతులు దాడి చేయడంతో ఆమె బంగ్లాపై నుంచి పడడంతో కాళ్లు విరిగాయి.

– సాయికృష్ణ, ఎల్లారెడ్డి

కుక్కల సంతతిని తగ్గించాలి

కుక్కలు గుంపుగుంపులుగా తిరగి మనుషులపైకి ఎగబడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తాయోనని భయంగా ఉంది. వీటిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. వాటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాలి.

– వసంత్, ఎల్లారెడ్డి

వరికొయ్యలను తగలబెట్టొద్దు

కామారెడ్డి రూరల్: ప్రస్తుత కాలంలో వరి పంట కోసిన తర్వాత మిగిలిన కొయ్యలను విరివిగా కాల్చుతున్నారని, ఇలా కాల్చడం ఎన్నో చెడు ప్రభావాలకు దారితీస్తుందని కామారెడ్డి ఏడీఏ అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ముఖ్యంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయి అది మన వాతావరణానికి ఎంతో హాని చేస్తాయన్నారు. కాబట్టి రైతులు కాల్చకుండా ప్రత్యామ్నాయంగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అనే ఎరువును చల్లుకుని నీరు పెట్టి ఒక మూడు రోజులు మురగనిస్తే భూసారం పెరుగుతుందన్నారు. కాల్చడం వల్ల భూమికి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోతాయని, దీని వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటుదన్నారు. గాలి కూడా కలుషితమవుతుందన్నారు. మట్టిలో సేంద్రియ కర్బనం అనేది భూసారానికి ఒక ఇండెక్స్ లాంటిది.. ఈ సేంద్రియ కర్బనం పై 20 సెంటీమీటర్లలో ఎక్కువగా ఉంటుందని పంటలు కాల్చినప్పుడు ఈ సేంద్రియ కర్బనం ఒక బూడిదలాగా మారి పోయి పంట పొలాలు ఎందుకు పనికి రాకుండా పోతాయని తెలిపారు. రైతులు ఈ విషయాలను గమనించి పంట భూసారం దెబ్బతీసే పనులు చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి ఏడీఏ అపర్ణ

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బాన్సువాడ: డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని తాడ్కోల్, రాజారాందుబ్బ, బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకున్న 34 మంది లబ్ధిదారులకు రూ.23.20 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ప్రతి ఒక్కరికీ బిల్లు వచ్చేలా చూస్తామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు గంగుల గంగారం, శ్రీధర్, ఎజాస్, సందీప్, ఆరిఫ్, మధుసూదన్‌రెడ్డి, సాయిలు, హకీం తదితరులున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

వినియోగదారుల సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి: తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ శంకర అన్నారు. శుక్రవారం వినియోగదారుల సేవా కేంద్రాన్ని రామారెడ్డిలోని మిస్టర్ టీ పాయింట్‌లో మేనేజర్ శంకర ప్రారంభించారు. సేవా కేంద్రంలో ప్రజలు ఆధార్ కార్డుతో మీ సొంత అకౌంట్ నుంచి డబ్బులు తీసుకోవచ్చునని తెలిపారు. బ్యాంకులో రద్దీ పెరగడంతో సేవ కేంద్రాలు బాగా పని చేస్తున్నాయని మాజీ సర్పంచ్ సంజీవ్ అన్నారు. గ్రామ పెద్దలు మెడికల్ శ్రీనివాస్, సుంకోజీ గంగాధర్, ఉస్కె సాయిలు పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ శంకర

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి, మత్తమాల, మాచాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు వెడల్పు పనులలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి 132 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఆపరేషనల్ ఏడీఈ కిరణ్‌చైతన్య తెలిపారు. పట్టణంలోని అశోక్ నగర్, విద్యానగర్, ఇండస్ట్రీయల్ ఏరియా, టేకిర్యాల, ఇల్చిపూర్ తదితర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుందని, అయినప్పటికి కొంత సమయం అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున వినియోగదారులు సహకరించాలని ఏడీఈ విజ్ఞప్తి చేశారు.

బాన్సువాడ పరిధిలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్, తాడ్కోల్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాన్సువాడ రూరల్ ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

30 నుంచి శతచండీ మహాయాగం

కామారెడ్డి అర్బన్: స్థానిక త్రిశక్తిదేవీ ఆలయంలో ఈ నెల 30, డిసెంబర్ 1, 2 తేదీల్లో శ్రీరుద్ర సహిత శత చండీ పురశ్చరణ మహాయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సమయానుకూలంగా మూడు రోజుల పాటు ప్రముఖ పండితులతో ఆధ్యాత్మిక ప్రవచనాలుంటాయన్నారు. విరాళాలు అందించే వారు కోశిక శ్రీధర శర్మ 89195 23735కు సంప్రదించాలన్నారు.

గోదాం నిర్మాణానికి స్థలం కేటాయించండి



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల పరిధిలో 50 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి స్థలం కేటాయించాలని శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డిలు కోరారు. పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మహమ్మద్‌నగర్‌కు 50వేల మెట్రిక్ టన్నుల గోదాం, సబ్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై డీఎంలను వారు కోరారు

'పోచారం గురించి తప్పుగా మాట్లాడటం సరికాదు'



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురించి తప్పుగా మాట్లాడటం సరికాదని బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ యామ రాములు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఒరిజినల్, డూప్లికేట్ అని మాట్లాడుతున్న వారే కాంగ్రెస్ నాయకులు కాదన్నారు. మీరు నమ్ముకున్న రవీందర్ రెడ్డి రోజుకొక పార్టీ మారుతున్నాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పోచారం ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారని గుర్తు చేశారు. నాయకుల పెర్క శ్రీనివాస్, మాజీ ఎంపీపీ విఠల్, మజీద్, ప్రతాప్, సందీప్, రఘు, సక్రు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి తప్పని తిప్పలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పెద్ద ఆత్మకూర్‌లో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియల నిర్వహణకు కుటుంబసభ్యులు, బంధువులు కొంతకాలంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం ఇటీవల తహసీల్దార్ గ్రామానికి చేరుకొని స్థలాన్ని పరిశీలించినప్పటికీ అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు మాత్రం తప్పలేదు. గ్రామానికి చెందిన పలంచ కిష్టయ్య అనే వృద్ధుడు శుక్రవారం మరణించారు. ఆయన అంత్యక్రియల నిర్వహణ కోసం కుటుంబసభ్యులు, బంధువులు గ్రామశివారులోని శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. శ్మశానవాటికకు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పంటపొలాలు, ముళ్లపొదల మధ్య నుంచి మోసుకెళ్తూ అంతిమయాత్ర నిర్వహించారు. అధికారులు చొరవ చూపి దారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వే డాటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలి

బాన్సువాడ సబ్ కలెక్టర్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో జరుగుతున్న సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వే వివరాలు నమోదు చేస్తున్న తహసీల్, ఎంపీడీవో కార్యాలయం, గిరిజన గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించారు. ఒక రోజుకు కేవలం 50-60 కుటుంబాల వివరాలే నమోదు చేయడం సరికాదన్నారు. ఆమె వెంట నాయబ్ తహసీల్దార్ బావయ్య, ఎంపీడీవో సూర్యకాంత్, గిర్దావార్ అంజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఉన్నారు.



గదిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినుల ఆందోళన

దోమకొండ: సీతారాంపల్లి బాలికల పాఠశాలలో విద్యార్థినులు శుక్రవారం రెండు గంటల పాటు ఆందోళన చేశారు. స్థానిక కేజీబీవీ సిబ్బందిని బీబీపేటకు బదిలీ చేసి అక్కడి వారిని సీతారాంపల్లికి పంపించారని వారు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వారిని తిరిగి ఇక్కడికే పంపించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఆందోళన విరమించబోమని వారు భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో విజయ్‌కుమార్ విద్యార్థులను సముదాయించారు. లిఖిత పూర్వకంగా విద్యార్థినులు సమస్య గురించి రాసి ఇస్తే దానిని జిల్లా కలెక్టర్‌కు, అధికారులకు అందజేసి తగిన చర్యలు తీసుకుంటానని ఎంఈవో హామీ ఇచ్చి వారి ఆందోళనను విరమింపజేశారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో

మాలల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలి



బాన్సువాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బాన్సువాడ: వచ్చే నెల 1న నిర్వహించే మాలల సింహగర్జన మహాసభలను విజయవంతం చేయాలని మాల మహానాడు దళిత సంఘం రాష్ట్ర నాయకులు అయ్యాల సంతోష్, డివిజన్ అధ్యక్షుడు మల్లూరి సాయిలు అన్నారు. శుక్రవారం బాన్సువాడలో సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. మాల మహానాడు నేతలు నర్సింలు, వెంకటేష్, చిన్న సంగయ్య, బాలసాయి, కృష్ణ, నక్క సుధీర్, సంపత్, దత్తు, మేకల సాయిలు, ప్రదీప్, జగన్మోహన్ తదితరులున్నారు.

బాన్సువాడ రూరల్: మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య కోరారు. శుక్రవారం ఆయన బాన్సువాడ నియోజకవర్గ మాల మహానాడు నాయకులు నర్సింలు, గైని రవి తదితరులతో కలిసి కోనాపూర్, కాద్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. మాలసంఘం నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మన్నె చిన్న సాయిలు, బేగరి సాయిలు, మన్నె నాగభూషణం, సురేష్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలి



రాజంపేటలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాం



కామారెడ్డిలో మాట్లాడుతున్న తిరుమల ప్రసాద్

రాజంపేట/కామారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పక్కాగా ఆన్‌లైన్లో ఎంట్రీ చేయాలని రాజంపేట ఇంచార్జి ఎంపీడీవో రఘురాం, కామారెడ్డి మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్, నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణి రత్నం డాటా ఎంట్రీ ఆపరేటర్లకు వేర్వేరుగా సూచించారు. శుక్రవారం రాజంపేట, కామారెడ్డి, నాగిరెడ్డిపేట పరిధిలో సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వారు పరిశీలించారు.



నాగిరెడ్డిపేటలో.. మండల ప్రత్యేకాధికారిణి రత్నం

స్కూల్‌కు అనుమతి ఇవ్వొద్దని వినతి



కామారెడ్డి టౌన్: బాన్సువాడలో ఓ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థకు అనుమతి ఇవ్వద్దని డీఈవో ఎస్.రాజుకు పీడీఎస్‌యూ, తెలంగాణ విద్యార్థి పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ఎస్.రాజుకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘాల జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, శ్రీకాంత్ ఉన్నారు.

కోర్టు తీర్పును అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: పెన్షనర్లకు సంబంధించిన కమ్యూటేషన్ నిధులను చెల్లించాలని కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంత్‌రెడ్డి, విజయరామరాజులు శుక్రవారం పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులను పాటించాలని ప్రభుత్వంతో పాటు డీటీఏ, డీటీవో, ఎస్టీవో అధికారులకు సైతం ఉత్తర్వులు అందాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రాంపల్లితండా, రాంపల్లి కొన తండా ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి షౌకత్‌అలీ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని ఆరాతీశారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. డిసెంబర్ 4న జరిగే నాస్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఓంకార్, సాయి చందన, సీఆర్పీ సంగాగౌడ్ ఉన్నారు.

డెయిరీ కళాశాలలో ఘనంగా ఫౌర్మేషన్ డే



కామారెడ్డి అర్బన్: పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. ప్రిన్సిపాల్ కేఎస్ ఉమాపతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

'సౌత్‌క్యాంపస్‌లో ఆర్ఎస్ఎస్ సభ నిర్వహించడం తగదు'



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఈనెల 20న ఆర్ఎస్ఎస్ సభ నిర్వహించారని, ఇలాంటివి తగవని ఎన్ఎస్‌యూఐ, బీవీఎం, ఎస్ఎఫ్ఐల ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఇలాంటివి పునరావృతం కాకుండా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నేతలు యశ్వంత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. గురువారం నాటికి 27 వేల 894 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లుతెలిపారు.

'సీఎం కప్ పోటీల్లో యోగాసన క్రీడలుంటాయి'

కామారెడ్డి అర్బన్: తెలంగాణ సీఎం కప్ రాష్ట్ర కీడల్లో యోగాసనాలను కూడా చేర్చినట్లు యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో యోగాసనాలు లేకపోవడంతో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీ స్పోర్ట్స్ అథారిటీని కలిసి చేసిన పలు విజ్ఞప్తులు ఫలించాయన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో యోగాసనాలను సీఎం కప్ క్రీడల్లో చేర్చడం సంతోషం కలిగించిందన్నారు.

దిశ కమిటీ సభ్యుడిగా రాజు ఎంపిక

లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా లింగంపేటకు చెందిన దేశ్‌ముఖ్ రాజు నియమితులయ్యారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మున్సిపల్ చైర్మన్‌లు, 22 మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీ నామినేట్ చేసిన మరో ఐదుగురు సభ్యులుగా దిశ కమిటీలో కొనసాగుతారని జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా నాయికమ్మ వార్షికోత్సవాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల శివారులో గల నాయికమ్మ ఆలయం వద్ద శుక్రవారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలు, నూతన వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో నరేందర్‌రావు, మనోహర్‌రావు, భువనేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పుట్ట ఎల్లమ్మకు బోనాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పుట్ట ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు బోనాలను సమర్పించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, గౌడ సంఘం నేతలున్నారు.